


తిరుమలశ్రీ

త్రల వంచుకుని సీరియస్‌గా పని చేసుకుంటూన్న నా దగ్గరకొచ్చి, "కమాన్ బ్రదర్! పైల్సు కట్టిపెట్టి లేచిరా" అన్నాడు నాతోటి గుమాస్తా ఆనందరావు.

"ఎక్కడికి?" అన్నాను తలెత్తి చూపి.

"ఎక్కడకేమిటి? యిది యూనియన్ వుత్తరువు" అన్న అతని వంక చిత్తరువులా చూస్తూ ఉండి పోయాను అర్థం కాక.

అతను నవ్వి, "మన ఎంప్లాయీస్ యూనియన్ సమ్మె ప్రారంభిం

చింది. ఎవరూ పని చేయకూడదు" అన్నాడు.

"స్ట్రైయికా! ఎందుకూ?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఎందుకేమిటి? మేనేజ్‌మెంట్ యొక్క యాంటీ ఎంప్లాయస్ పాలిసీకి నిరసనగా" జవాబిచ్చాడతను.

"ఇంతకూ ఏం జరిగింది?" కుతూహలంగా అడిగాను.

"ఇప్పుడదంతా వివరించడానికి టైము లేదు. లేచిరా" అన్నాడు ఆనందరావు.

డైలమాలో పడ్డాను నేను. ఆ ఆఫీసులో నేను చేరి ఆరునెలలే అయింది. ప్రొబెషన్‌లో ఉన్నాను. సమ్మెలో పాల్గొంటే ఉద్యోగం నుండి తొలగిస్తారేమోనన్న భయం పైగా, మంత్లీ రిటర్న్స్ మర్నాడు వెళ్ళి పోవాలి. లేకుంటే కొంప మునుగుతోంది. అలాగని యూనియన్‌ని ఎదిరించే ధైర్యమూ లేదు. తప్పనిసరిగా ఫైల్సు మూసి పైకి లేచాను.

స్టాఫంతా హాల్లో చేరారు.

"యాజమాన్యపు నిరంకుశత్వం.... నశించాలి!"

"యాంటీ వర్కర్స్ పాలిసీ.... నశించాలి!"

"మేనేజ్‌మెంట్....డౌన్ డౌన్!"

"ఎమ్. డి.....డౌన్ డౌన్,"

వర్కర్సంతా నినాదాలు చేస్తున్నారు.

అంత హఠాత్తుగా సమ్మె ఎందుకు చేస్తున్నారో కారణం తెలియలేదు నాకు.

ప్రక్కనున్న అతన్ని అడిగాను - "సమ్మె యెందుకు చేస్తున్నారు?" అని.

"వర్కర్స్‌ని అణిచి వేయడానికి ప్రయత్నిస్తోంది మేనేజ్‌మెంట్" అన్నాడతను,

"అసలేం జరిగింది?"

"తెలియదు" మరో వ్యక్తి నడిగాను - "అసలు సమ్మెకు కారణమేమిటి?"

"వర్కర్స్‌ని హరాస్ చేస్తున్నారు అధికారులు" అన్నాడతను.

"ఇప్పుడేం జరిగిందట?"

"నాకు తెలియదు."

ఇంకో వ్యక్తిని సమీపించాను, "యింత హఠాత్తుగా సమ్మె చేయవలసిన అవసరమేమిటి?" అని ప్రశ్నించాను.

యాజమాన్యం పనివాళ్ళను మోసం చేస్తోంది, వినల్ని అణచివేయాలని చూస్తోంది...." అన్నాడతను కించిత్తు ఉద్రేకంగా.

"మేనేజ్‌మెంట్ ఏం మోసం చేసింది?"
కుతూహలంగా అడిగాను.
"సారీ, వివరాలు తెలియవు"
తెల్లబోయాను నేను.... ఒక్కరికీ అసలు కారణం తెలిసినట్లు లేదు. విషయం తెలుసుకోకుండానే గుడ్డిగా సమ్మెలో పాల్గొనడమా!? ఎంతమందిని ప్రశ్నించినా కారణం తెలుసుకోలేక పోయాను. అప్రయత్నంగా గొర్రెలమంద గుర్తుకొచ్చింది. నాకు వారిని చూస్తూంటే. స్లోగన్ షౌటింగ్ జరుగుతూనే ఉంది. అంతా గోలగా గందరగోళంగా ఉంది.
ఒక మూలగా నిలుచొని, మధ్య మధ్య వారి నినాదాలలో నేనూ పాలు పంచుకుంటున్నాను।
పర్సనల్ ఆఫీసరు, వెల్‌ఫేర్ ఆఫీసరు పరుగెత్తుకొచ్చారు - సమ్మెకు కారణం ఏమిటని అడుగుతూ. సరయిన జవాబు లభించ లేదు వారికి. యూనియన్ లీడర్ని చర్చలకు ఆహ్వానించారు వాళ్ళు. కాని. లీడర్స్ వెళ్ళలేదు.
ఆ రోజంతా సమ్మె నిరాటంకంగా సాగుతూనే ఉంది. సాయంత్రం కాగానే ఇళ్ళకు వెళ్ళిపోయారంతా. మర్నాడు ఉదయం మళ్ళీ ప్రారంభమయింది సమ్మె. నాయకులు గేటు వద్ద నిలుచుని ఎవరూ పనిలోకి వెళ్ళకుండా ఆపుతున్నారు.
రెండవ రోజున కూడా సమ్మె శాంతియుతంగానే సాగింది. ఆ రోజు మాత్రం యేవేవో డిమాండ్స్ బోర్డులు రాసి పెట్టారు.... అన్నీ జనరల్ డిమాండ్స్ తప్పిస్తే ఒక్కదానిలోనూ ప్రత్యేకత కనిపించలేదు నాకు. నాయకులు చర్చలకు నిరాకరించారు తమ కోర్కెలను తీరిస్తే తప్ప చర్చలకు అవకాశం లేదని తెగించి చెప్పేసారు. యూనియన్ సెక్రెటరీ, తక్కిన ఆఫీసు బేరర్సు కనిపిస్తున్నారేగాని, ప్రెసిడెంట్ జాడ లేదన్న విషయం గుర్తించాను నేను. ముందు రోజున కూడా అతన్ని చూపిస గుర్తు లేదు. ఆఫీసులో అకౌంటెంట్ అతను. ఎవరో అడిగితే ఎమ్. డీ. ని కలుసు కోవడానికి హెడ్డాఫీసుకి వెళ్ళుంటాడన్నారు.
సమ్మె మూడవ రోజుక్కూడా ప్రాకింది .... అసలు ఎందుకు చేస్తున్నారో, చర్చలకు నిరాకరించడానికి కారణమేమిటో బోధపడ లేదు నాకు. మేనేజ్‌మెంట్ ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తోంది, నాయకుల్ని కాన్ఫరెన్స్ టేబిల్ దగ్గరకు తీసుకొచ్చేందుకు. ప్రయోజనం లేకపోయింది.

ఉన్నట్లుండి ఓ పుకారు పుట్టింది - యూనియన్ ప్రెసిడెంట్ ను మేనేజ్‌మెంట్ కిడ్నాప్ చేయించిందని. దాంతో మాబ్ వయొలెంట్‌గా మారిపోయింది. అదంతా అబద్ధమని ఎమ్. డి. స్వయంగా వచ్చి చెప్పినా, ప్రయోజనం లేకపోయింది. తీవ్రవాదులు కొందరు కంపెనీ ప్రాపర్టీని ధ్వంసం చేయడము, ఆఫీసర్లను అటాక్ చేయడం వరకు తీసుకొచ్చారు పరిస్థితిని. మేనేజ్‌మెంట్ పోలీస్ రక్షణను కోరవలసిన అవసరం ఏర్పడింది. పోలీసుల రాకతో పరిస్థితి తీవ్రంగా పరిణమించింది. రాళ్ళు రువ్వడం, లాఠీ చార్జీల వరకూ దారితీసింది. భయంతో అక్కడినుండి జారుకున్నాను నేను.

మర్నాడు భయపడుతూనే వెళ్ళాను కంపెనీకి. నా ఆశ్చర్యానికి అంతు లేకపోయింది....సమ్మె విరమణ జరిగిందట - అంతా పనుల్లోకి వెళుతున్నారు. యూనియన్ ప్రెసిడెంట్ సురక్షితంగానే వున్నాడట. మూడు రోజులపాటు ముమ్మరంగా సాగిన సమ్మె - ప్రారంభించినంత హఠాత్తుగా ఎందుకు విరమించిందో అసలు ఆ సమ్మెవల్ల కార్మికులు సాధించినదేమిటో, యూనియన్ యొక్క ఎయిమ్ ఏమిటో బోధపడలేదు నాకు. నా సందేహనివృత్తి కోసం ఆనందరావు దగ్గరకు వెళ్ళాను. యూనియన్ లీడర్స్‌కి క్లోజ్‌గా వుంటాడతను. అన్ని విషయాలూ అతనికి తెలుస్తాయని వినికిడి.

నా సందేహాలను ఆలకించి ఫకాలున నవ్వాడు ఆనందరావు. తెల్లబోయిన నన్ను భుజం తట్టి "ఓహ్. నీకు సమ్మె అనుభవం ఇదే ప్రథమం కదూ!" అన్నాడు. తరువాత అటూ ఇటూ చూసి, గొంతు తగ్గించి రహస్యం చెబుతూన్నవాడిలా అన్నాడు - "ఇది పరమ రహస్యం. నువ్వు క్లోజ్ ఫ్రెండ్‌వి కనుక చెబుతున్నాను. ఇంకెవరికీ చెప్పకేం?" అన్నాడు.

అయోమయంగా తలూపాను.

"చూడు బ్రదర్! అసలు ఈ సమ్మెకు కారణమంటూ లేదు.... మన యూనియన్ ప్రెసిడెంట్ ప్రసాదరావు మేనకోడలికి పెళ్ళి మొన్న. మూడ్రోజులు సెలవు కావలసి వచ్చిందతనికి. సెలవు లేమో లేవు. పైగా, రెండు వారాల క్రితం ఎమ్. డి. జారీ చేసిన ఆర్డరు గుర్తుంది కదూ? పైనాన్షియల్ ఇయర్ క్లోజింగ్ మూలంగా ఎవరూ ఎట్టి పరిస్థితిల్లోనూ ఒక్క రోజు కూడా సెలవు తీసుకోవడా

నికి వీల్లేదని హుకుం జారీచేసాడు.

ఎమ్. డి. ఎంత స్ట్రిక్టు మనిషో నీకు తెలుసుగా!....కాని, మేన కోడలి పెళ్ళికి ప్రసాదరావు వెళ్ళి తీరాలి. మరో మార్గం కనిపించక సెక్రటరీతో ఆలోచించి ఈ ప్లాన్ వేసాడు" అని నవ్వాడు ఆనంద రావు.

"అంటే -?" అన్నాను అయోమయంగా.

"యింకా అర్థం కాలేదా?" అని "ఏదో వంకతో సమ్మె ప్రారంభించడంతో, ఆ సందడిలో ప్రెసిడెంట్ పెళ్ళికి వెళ్ళొచ్చేసాడు....అతని పర్పస్ సెర్వ్ అయిపోవడంతో సమ్మె దానంతటదే ఆగిపోయింది" ఆశ్చర్యంతో తెరుచుకున్న నానోరు మూత పడితే వొట్టు! *


## 85,000 రూ. విలువగల బహుమతులు గెల్చుకోండి!

నమూనా టోటల్ : 69

| | | |
|---|---|---|
| 22 | 27 | 20 |
| 21 | 23 | 25 |
| 26 | 19 | 24 |

ప్రవేశరుసుం లేదు ! మొదట అందిన పది ఎంట్రీలకుగడియారం ఉచితం! బహుమతులు : టెలివిజన్ లేక టేప్‌రికార్డర్, మోటార్ సైకిల్.

కన్సొలేషన్ బహుమతులు : జెనీవా టు ఇన్ వన్ మోడల్ ట్రాన్సిస్టర్ రూ. 310 ఖరీదైనది అమ్మకం ధరపై. ఇది సేల్స్ ప్రమోషన్ ప్రణాళిక. ఒక పోస్టుకార్డు మీద నమూనాలో చూపినట్లుగా 9 ఖాళీ గళ్ళను తయారు చేసుకొని, 18 నుండి 26 వరకు గల అంకెలను వాడుతూ, అడ్డంగా, నిలువుగా, ఐ మూలగా- ఎటు కూడినా టోటల్ 63 వచ్చేలా నింపి పంపండి. ఒక అంకెను ఒకేసారి ఉపగియోంచాలి. ఎంట్రీలు 20 రోజుల్లోగా అందాలి.

**TELESTAR AGENCIES (C-29)**
**358, Ram Nagar Extn., Delhi-51.**